

బిచ్కుంద డిగ్రీ కళాశాలలో 9న జాబ్‌మేళా

బిచ్కుంద, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 9న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్లేస్‌మెంట్ సెల్ రసాయన శాస్త్రవిభాగం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్‌మేళాలో ఎంఎస్ఎన్ ఫార్మాకంపెనీలో జూనియర్ ట్రైనీ ఉద్యోగాలకు అభ్యర్థుల ఎంపిక చేస్తారని తెలిపారు. కెమిస్ట్రీ ఒక ఆప్షనల్ సబ్జెక్ట్‌గా చదవి 2021, 22, 23, 24లో బీఎస్సీ పూర్తిచేసుకున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు కూడా హజరుకావచ్చని తెలిపారు.



కల్లునాయకులు!

- జిల్లాలో విచ్చలవిడిగా కల్తీకల్లు అమ్మకాలు
- మోతాదుకు మించి మత్తు పదార్థాలతో తయారీ
- పలు డిపోల పరిధిలో విచ్చలవిడిగా అల్ఫాజోలం వినియోగం
- డిపోల్లోనే కల్తీ చేస్తున్న అక్రమార్కులు
- కల్తీ కల్లు తాగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న బాధితులు
- కల్లుకు బానిసలవుతూ వింత ప్రవర్తన
- తాజాగా నస్రుల్లా బాద్, బీర్కూర్‌లో కల్తీ కల్లుతో 32 మందికి అస్వస్థత
- ఇద్దరి పరిస్థితి విషమం
- కల్లులో కలిపే మత్తుపదార్థాలపై నిఘా పెడుతున్నా ఆగని కల్తీ
- ఇటీవల మద్నూర్‌లో పెద్ద మొత్తంలో అల్ఫజోలంను పట్టుకున్న పోలీసులు



నస్రూల్లబాద్‌లో కల్తీకల్లును పారబోస్తున్న ఎక్సైజ్ పోలీసులు



చికిత్స పొందుతున్న బాధితులు

కామారెడ్డి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కల్తీ కల్లు విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. ప్రజల ఆరోగ్యం ఎటుపోతే మాకేంటి అనుకుంటూ కొందరు కాసుల కోసం కక్కుర్తి పడుతున్న అక్రమార్కులు తయారుచేస్తున్న మత్తెక్కించే కల్లు తాగిన ప్రజలు ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా స్వచ్ఛమైన చెట్ల కల్లు విక్రయం అరకొరగానే ఉంటోంది. కల్లు తక్కువ మత్తు కలిగించే మందు ఎక్కువ వేసి లేదంటే నిషేధిత మత్తుపదార్థాలు కలిపి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. మోతాదుకు మించి నిషేధిత మత్తుపదార్థాలను కలుపడంతో ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారు. తాజాగా నస్రూళ్లబాద్, బీర్కూర్ మండలాల్లో కల్తీకల్లు తాగి పలువురు బాధితులు తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రుల పాలయ్యారు. కల్తీ కల్లుకు బానిసైన వారు 48 గంటలలోపు అదే మత్తు కలిగించే కల్లును తాగకపోతే వింతగా ప్రవర్తిస్తున్నారు. చేతులు, కాళ్లు వణకడం, సరైన నిద్రలేక వింతగా ప్రవర్తించడం లాంటివి చేస్తున్నారు. ఇక అనుకొని సంఘటనలు, ప్రమాదాల్లో గాయాలపాలై ఆసుపత్రులకు చేరినవారు మత్తు కల్లుకు బానిసలై ఉంటే ఇక అంతే సంగతులు. ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంటుంది. ఆసుపత్రిలో చికిత్స అందించే వైద్యసిబ్బందితో, పక్కన బెడ్లపై ఉన్న రోగులతో గొడవలు పడడం చేస్తుండడం నిత్యకృత్యాలుగా మారుతున్నాయి. కల్లుకు బానిసలుగా మారి వింతగా ప్రవర్తించేవారు రోజుకు ఒక్కరైన ఆసుపత్రిలో చేరి నానా రభసచేస్తున్న సంఘటనలు చోటుచేసుకుంటుండడంతో వైద్యులు తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలో ఇంత జరుగుతున్న ఉన్నతాధికారులు దృష్టిసారించకపోతే ప్రజలు పరిస్థితి ఎలాగనే వాదనలు వినిపిస్తున్నాయి.

పుట్టగొడుగుల్లా కల్లు కంపౌండ్‌లు

జిల్లాలో కల్లు డిపోలు 22 ఉండగా కల్లు బట్టిలు 160 ఉన్నట్లు ఎక్సైజ్ శాఖాధికారులు చెబుతున్నారు. గీతా కార్మికులు 1200 మంది ఉన్నారు. జిల్లాలో ఈత, తాటి చెట్లు పెద్ద మొత్తంలో లేవు. ఉన్న వాటి నుంచే కల్లును తీసి గీతా కార్మికులు కల్లులో నీళ్లు కలుపుతూ విక్రయిస్తున్నారు. కాని కొందరు వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా చెట్ల నుంచి గీసిన కొద్దిపాటి కల్లును మత్తు పదార్థాలతో కల్తీ చేస్తూ విక్రయిస్తున్నారు. జిల్లాలో కల్తీ వ్యాపారులు కొంతకాలం పాటు తగ్గుముఖం పట్టినప్పటికీ ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లోనూ జోరుగానే సాగుతోంది. గతంలో కల్తీ కల్లులో ప్రధానంగా వాడే మత్తుపదార్థాల సరఫరాపై నిఘాపెట్టి దాడులు నిర్వహించారు. అప్పట్లో కల్తీ కల్లులో కలిపె మత్తు మందులను సరఫరా చేసే వారిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకోని పెద్దమొత్తంలోనే ముడి సరుకులను స్వాధీనం చేసుకున్న సంఘటనలు ఉన్నాయి. ఈ క్రమంలో కొద్దిరోజుల పాటు కల్తీ కల్లువ్యాపారం తగ్గింది. ఇటీవల ఈ మధ్యే వ్యాపారం మరింత పెరిగింది.

కల్లు డిపోలలోనే కల్తీ

జనాన్ని మత్తులో చిత్తు చేసేందుకు కల్లులో అల్ఫాజోలం, డైజోపామ్, క్లోరో హైడ్రేడ్ లాంటి ప్రమాదకరమైన మత్తు పదార్థాలను వ్యాపారులు (తరువాయి 8వ పేజీలో..)

కల్తీ కల్లు తాగి 32 మందికి అస్వస్థత

- ఇద్దరి పరిస్థితి విషమం.. నిజామాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలింపు
- కల్తీ కల్లు బాధితులను పరామర్శించిన సబ్ కలెక్టర్

నస్రుల్లాబాద్/బీర్కూర్, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో సోమవారం కల్తీకల్లు తాగి 32మంది అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు వీరందరినీ వెంటనే బాన్సువాడ ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని నసుల్లాబాద్ మండలం అంకోల్‌తండా అంకోల్, దుర్కి, సంగం గ్రామాలతోపాటు బీర్కూర్ మండలం దామరాంచకు చెందిన బందే బోయి రాజు, పర్వయ్య, గైని గంగారాం, సీత కాశీ, సలీమబీ, గంగారాంలతో పాటు మరికొందరు కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. రోజూ మాదిరిగానే సోమవారం మధ్యాహ్నం కూడా ఆయా గ్రామాల్లోని కల్లు దుకాణాల్లో వీరంతా కల్లు తాగారు. అయితే ఇంటికి వచ్చిన తర్వాత ఒక్కొక్కరు.. ఇలా మొత్తం 32మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఇందులో కొందరికి తల వంకర కావడం.. కాళ్లు చేతులు లేపలేని పరిస్థితికి చేరుకోవడంతో కుటుంబీకులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. దీంతో వారిని వెంటనే కుటుంబీకులు అంబులెన్స్‌లో బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితులకు పరీక్షలు నిర్వహించిన వైద్యులు.. కల్తీకల్లు తాగడం వల్లే అందరూ అస్వస్థతకు గురయ్యారని నిర్ధారించారు. ఇందులో అంకోల్ గ్రామానికి చెందిన రవి, మధుకుమార్‌ల పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దామరాంచ గ్రామానికి చెందిన బాయికాడి సునితని చికిత్స నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా.. కల్తీకల్లు ఘటనపై ఎక్సైజ్‌పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అదే సమయంలో కల్లుకల్తీ కావడానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. కల్లు తయారీలో విష పూరిత రసాయనాలు వాడడం వల్లే వీరంతా అస్వస్థతకు గురయ్యారా!? అన్న విషయమై విచారణ జరుపుతున్నారు. కాగా.. కల్తీ కల్లు తాగి బాన్సువాడ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి పరామర్శించారు. పరిస్థితికి (తరువాయి 8వ పేజీలో..)

నిధుల కోసం మాజీ సర్పంచ్‌ల నిరీక్షణ

- బిల్లులు రాక.. వడ్డీలు కట్టలేక సతమతం
- గ్రామాలు అభివృద్ధి చేస్తే అప్పులే మిగిలాయని ఆవేదన
- తెచ్చిన డబ్బుకు పెరిగిపోతున్న వడ్డీ
- పదవీ కాలం ముగిసి ఏడాదైనా మంజూరు కాని నిధులు

వివరాలు 7లో....


రాజ్యాంగాన్ని రక్షించుకుంటేనే దేశానికి మనుగడ

- ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ

మాచారెడ్డి, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని రక్షించుకుంటేనే దేశానికి మనుగడ ఉంటుందని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో కామారెడ్డి ఇంచార్జ్ కత్తివెంకటస్వామితో కలిసి జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ ప్రచారం ప్రారంభించి రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై కేంద్రహోం మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రారంభించిందని అన్నారు. అంబేద్కర్‌ను అవమానిస్తూ రాజ్యాంగాన్ని కించపరిచేలా బీజేపీ, ఆర్‌ఎస్ఎస్ ఏ విధంగా వ్యవహరిస్తున్నాయో ప్రజలకు తెలియజేయడానికే ఈ కార్యక్రమం చేపట్టమన్నారు. గాంధేయ మార్గంలో ఊరూరా పాదయాత్రలో జాతీయ జెండాతో మహాత్మాగాంధీ చిత్రపటం, అంబేద్కర్ చిత్రపటం భారత రాజ్యాంగం ప్రదర్శించి నిరసన వ్యక్తంచేస్తున్నామన్నారు. కేంద్రంలోని బీజేపీ రాజ్యాంగ విలువలను కాలరాస్తూ మనువాద రాజ్యాంగాన్ని తీసుకురావాలని ప్రయత్నిస్తుందన్నారు. అంబేద్కర్ గొప్పతనాన్ని చాటిచెప్పి మన భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని అన్నారు.

సన్నబియ్యం పంపిణీ చారిత్రాత్మకమైన నిర్ణయం

సన్నబియ్యం పంపిణీ చారిత్రాత్మకమైన నిర్ణయమని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. సోమవారం మాచారెడ్డిలో ప్రజాపాలనలో భాగంగా పేదలకు అందించే ఉచిత సన్నబియ్యం పంపిణీ కార్యక్రమానికి హాజరై అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేసి దళితులతో సహపంక్తి భోజనం చేశారు. తాను పుట్టిన గ్రామంలో దళితుడి ఇంట్లో అన్నం తింటుంటే తన సొంతింట్లో తిన్నట్లు అనిపిస్తోందని అన్నారు. సన్నబియ్యం పంపిణీతో పేదవాడి కుటుంబం సంబరపడటం సంతోషగా ఉందని అన్నారు. రాష్ట్రంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న నిరుపేదలందరికీ పూర్తిస్థాయిలో ఆహారభద్రత కల్పించేందుకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. సన్నబియ్యం సరఫరాలో ఎలాంటి అవకతవకలూ జరగనివ్వద్దని గోదాముల నుంచి బియ్యం రవాణా, రేషన్‌షాపుల నుంచి లబ్ధిదారులకు పంపిణీ చేయడంలో ఏమైనా లోటుపాట్లు ఉంటే సరిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మాచారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల రైతులు వినియోగించుకోవాలని కోరారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ కృషి చేస్తోందని అన్నారు. పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామన్నారు. రైతులు దళారులను నమ్మిమోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే విక్రయించుకుని మద్దతు ధరపొందాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, కాంగ్రెస్ రాష్ట్రనాయకుడు మహ్మద్ ఇలియాజ్,డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, మాజీ ఎంపీపీ లోయపల్లి నర్సింగ్‌రావు,మండల అధ్యక్షుడు నౌసిలాల్,పల్వంచ మండల రమేష్‌గౌడ్, గణేష్ నాయక్, కామారెడ్డి మండల అధ్యక్షుడు గూడెం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ ప్రచారంలో పాల్గొన్న షబ్బీర్‌అలీ

వ(మ)ంట గ్యాస్!

- సామాన్యుడిపై కేంద్ర సర్కారు బాదుడు
- సిలిండర్‌పై రూ.50 పెంపు
- రవాణాచార్జిల పేరిట అదనపు దోపిడీ
- సిలిండర్ ధర పెంపుతో జిల్లాలోని వినియోగదారులపై రూ.2కోట్ల అదనపు భారం



కామారెడ్డి టౌన్, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ ఓవైపు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుండగా మరోవైపు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను కేంద్రప్రభుత్వం పెంచడంతో సామాన్యప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా కేంద్రప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచింది. పెంచిన ధరలు అర్ధరాత్రి నుంచి అమలులోకి వస్తాయని కేంద్రం ప్రకటించింది. వంటగ్యాస్ ధర పెరగడంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు రవాణా చార్జిల పేరిట గ్యాస్ డిస్ట్రిబ్యూటర్‌లు దూరాన్ని బట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న ధరలు అద నపు వసూళ్లతో వంటగ్యాస్ సిలిండర్ సామాన్యులు మోయలేనంత బరువెక్కుతోంది.

జిల్లాపై రూ.2 కోట్ల భారం

వంటగ్యాస్ సిలిండర్ ధరను కేంద్రప్రభుత్వం మరోసారి రూ.50 పెంచడంతో జిల్లా వినియోగదారులపై ప్రతీ నెల సుమారు రూ.2కోట్ల అదనపు భారం పడనున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో 22 గ్యాస్ ఏజెన్సీలు ఉండగా ఈ ఏజెన్సీలో మొత్తం 3.21లక్షల గ్యాస్‌కనెక్షన్‌లు ఉన్నాయి. ఈ లెక్కన కామారెడ్డి జిల్లా వినియోగదారులపై పెంచిన ధరలతో రూ.2కోట్ల భారం పడనుంది. గ్యాస్ ధర పెంపుపై సామాన్యప్రజలు మండిపడుతున్నారు. ఇలా వంటగ్యాస్ ధరను పెంచుకుంటూ పోవడం మంచిది కాదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. నిత్యావసరానికి ఉపయోగించే వంట గ్యాస్ భారీగా పెరగడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే వంటగ్యాస్ ధర మండిపోతోందని కొనుగోలు చేసిన గ్యాస్ సిలిండర్‌ను పొదుపుగా వాడుకోవాల్సి వస్తుందంటున్నారు. ఇలాంటి తరుణంలో గ్యాస్ సిలిండర్‌లను ఉపయోగించలేని పరిస్థితి కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తుందని ప్రజలు అసహనం వ్యక్తంచేస్తున్నారు. గ్యాస్ ధర పెంచడంతో పేద, మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడనుంది.

రవాణా చార్జీల పేరిట దోపిడీ

జిల్లాలో గ్యాస్ ఏజెన్సీలు రవాణా చార్జీల పేరిట వినియోగదారులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్యాస్ ఏజెన్సీలు 5 కిలోమీటర్ల పరిధిలో ఉచితంగా డోర్ డెలవరీ చేయాలి. 30 కిలోమీటర్ల లోపు రూ.10, అంతకు ధర పెంచినప్పుడల్లా రవాణాచార్జీలు రూ.5 నుంచి 10 వరకు పెంచుకుంటూ పోతున్నారు. కొన్ని ఏజెన్సీలు డోర్ డెలవరీ చేయలేమని తమ వద్దకే వచ్చి తీసుకెళ్లాలని షరతులు పెడుతున్నారు. దీంతో వినియోగదారులు అవసరం కొద్దీ అదనంగా సొమ్ము చెల్లించి గ్యాస్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఒక్కో సిలిండర్‌ను డెలవరీ చేయాలంటే డెలవరీ బాయ్ సిలిండర్‌కు రూ.20 నుంచి 50 వరకు వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం పెంచిన ధరల ప్రకారం ఎల్‌పీజీ గ్యాస్ ధర రూ.930 డెలివరీ బాయ్ చార్జీలు కలుపుకుంటే రూ.980కి చేరుతోంది. ఇలా గ్యాస్ ధరలు పెరగడంతో వినియోగించలేని పరిసితి ఎదురవుతుందని వినియోగదారులు పేర్కొంటున్నారు.

గ్యాస్ ధర పెంపు సరికాదు

- సునీత, గృహిణి, కామారెడ్డి

వంట గ్యాస్ ధరను నిత్యం పెంచడంతో సామన్య ప్రజలపై పెనుభారం పడుతోంది. ఇప్పటికే నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగి ఏమీ కొనుగోలు చేసే పరిస్థితి లేకుండా మారింది. ఈ తరుణంలో కేంద్రప్రభుత్వం మరో మారు గ్యాస్ ధరను పెంచడం సరికాదు. డెలివరీ చార్జీలతో కలిపి రూ.980కు పైగానే చెల్లించాల్సి వస్తోంది. గ్యాస్‌పై వంట చేసుకునే పరిస్థితి లేదు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి.

వరిపై తెగుళ్ల దాడి

- చేతికి వచ్చే దశలో అధికంగా తెల్ల గొలక
- గింజలు గట్టి పడకుండానే దెబ్బతింటున్న వరి
- ఎన్ని మందులు కొట్టినా.. దక్కని ఫలితం



వివరాలు 7లో..

చీకటి పడితేచాలు..

గుట్టలు మాయం!

- బాన్సువాడలో ఆగని అక్రమ మొరం తవ్వకాలు
- గుట్టలను, చెరువులను తవ్వేస్తున్న మొరం మాఫియా
- సెలవు దినాల్లోనూ జోరుగా సాగిస్తున్న దందా
- రాత్రి నుంచి తెల్లవారుజాము వరకూ తవ్వకాలు
- మొరం మాఫియాతో పలువురు అధికారుల కుమ్మక్కు
- అక్రమ రవాణాను అడ్డుకునేవారు కరువు



రాత్రి సమయంలో ఇసుక తవ్వకాలు జరుపుతున్న దృశ్యం

బాన్సువాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాత్రి అయితే చాలు మొరం మాఫియా రాత్రికి రాత్రి గుట్టలను గుటుక్కుమని మాయం చేస్తోంది. గ్రామ శివారులు పట్టణ శివారులతో పాటు చెరువులు గుట్టలను తవ్వేస్తూ మొరందందా మూడు పూలు ఆరు కాయలుగా సాగుతోంది. సెలవు దినాలతోపాటు రాత్రి వేళల్లోనూ ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా మొరం తరలిస్తూ లక్షలాది రూపాయలను అర్జిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు.

డివిజన్‌లోని అన్ని మండలాల్లో తవ్వకాలు

బాన్సువాడ డివిజన్‌పరిధిలోని జుక్కల్, మద్నూర్, బిచ్కుంద, పిట్లం, పెద్దకొడప్‌గల్, నిజాంసాగర్, బీర్కూర్, నర్సుల్లాబాద్, నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి, బాన్సువాడ మండలాల్లో మొరం, మట్టి అక్రమ తరలింపు జోరుగా సాగుతుంది. బాన్సువాడ మండలం సోమేశ్వర్ వాసుదేవి పల్లి శివారు జనిగేలా కుంటలో, బీర్కూరు మండలం రైతు నగర్, అన్నారం, చించోలి, దామరంచ గ్రామ శివారులో ఎలాంటి అనుమతి లేకుండా యథేచ్ఛగా అక్రమ మొరం తవ్వకాలు సాగుతోంది. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పోలీస్, మైనింగ్‌అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. అక్రమార్కులు రాత్రిపూట తవ్వకాలు జరిపి గుట్టలను, చెరువులను మాయం చేస్తున్నారు. మైనింగ్‌శాఖ నుంచి ఎలాంటి అనుమతులూ లేకపోయినా అధికార పార్టీకి చెందిన నాయకుల పేరు చెప్పి తవ్వకాలు చేపడుతున్నారు. మొరం మాఫియా ఆగడాలు మితిమీరడంతో వనరులు, వృక్ష సంపద కనుమరుగవుతోంది.

• ప్రభుత్వ ఆదాయానికి గండి

అనుమతులు లేకుండా సాగుతున్న మొరం వ్యాపారంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. మొరం వ్యాపారం చేయాలంటే మైనింగ్‌శాఖ నుంచి అనుమతులు తీసుకొని రెవెన్యూ, పోలీసులకు సమాచారం ఇవ్వాలనే నిబంధన ఉంది. కానీ బాన్సువాడ డివిజన్‌లో నిబంధనలను తుంగలో తొక్కి దర్జాగా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి అక్రమ మొరం, మట్టి రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్తున్నా క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీస్, మైనింగ్‌శాఖ అధికారులు మామూలు తీసుకొని అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అభివృద్ధిపనుల పేరిట అధికారులకు తెలుపుతూ ప్రైవేట్ వ్యక్తులు చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలు, వెంచర్లు ఇతరత్రా నిర్మాణాలకు రాత్రి సమయాల్లో (తరువాయి 8వ పేజీలో..)



బాన్సువాడలోని వాసుదేవుపల్లి శివారులో మొరం తవ్వకాలు జరిగిన దృశ్యం

'తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడండి'



వాటర్ వర్క్స్ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

బోధన్‌రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలని బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ అన్నారు. సోమవారం ఉదయం బోధన్ పట్టణంలో శానిటేషన్ పనితీరును పరిశీలించారు. శానిటేషన్ సిబ్బంది ఎప్పటికప్పుడు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం వాటర్‌వర్క్స్ విభాగాన్ని పరిశీలించారు. బోధన్ పట్టణానికి బెల్లాల్ నుంచి సరఫరా అయ్యే నీటి పనితీరును పరిశీలించారు. ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. వాటర్‌వర్క్స్ సిబ్బందితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

డొంకేశ్వర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని డొంకేశ్వర్ ఎంపీడీవో బ్రహ్మానందం సూచించారు. డొంకేశ్వర్ మండలం గంగసారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల మార్కింగ్ చేశారు. నిర్మాణపనులు పూర్తి చేసుకున్నట్లయితే నిర్మాణస్థాయిని బట్టి డబ్బులు ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. త్వరగా పనులను పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట కార్యదర్శి మోహన్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

బోధన్‌రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్, బీజేపీల విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో పట్టణంలోని పోస్టాఫీస్ వద్ద సోమవారం కరపత్రాలను ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ దేశకార్మిక వర్గం భద్రత కోసం, మంచి వేతనం కోసం, యూనియన్ హక్కుల కోసం ఉద్యమిస్తుంటే మరో వైపు రైతులు ఎంఎస్‌పీకోసం గిట్టుబాటు ధరల చట్టపరమైన హామీ రుణ రద్దు డిమాండ్లతో పోరాడుతున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి పడాల శంకర్, సీతారాం, లింగం, పోశెట్టి, రాజు, గంగామణి, లక్ష్మి పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజుల జైలు

బోధన్‌రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపించిన ఏరాజ్‌పల్లి గ్రామానికి చెందిన గోపూరు గంగారాం అనే వ్యక్తిని ఆదివారం రాత్రి డ్రంక్‌అండ్‌డ్రైవ్‌లో పట్టుకుని సోమవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి శేషతల్ప సాయి రెండు రోజుల జైలుశిక్షను విధించారని బోధన్ పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బోధన్‌రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సునీత దేశాయ్, మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్ రావు దేశాయ్ కుటుంబాన్ని సోమవారం మహారాష్ట్ర బీజేపీ పార్టీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ అజీత్ గోక్ చాడే పరామర్శించారు. ఇటీవల వారి పెద్ద కుమారుడు ప్రీతమ్ దేశాయ్ గుండెపోటుతో మృతిచెందారు. సోమవారం వెంకటేశ్వర్ రావు దేశాయ్ కుటుంబాన్ని ప్రీతమ్ దేశాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రీతమ్ దేశాయ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహత్మ జ్యోతిబా పులే గురుకుల పాఠశాల అడిషనల్ డైరెక్టర్ శ్యాం పాల్గొన్నారు.

పొతంగల్‌లో చలివేంద్రం ఏర్పాటు

కోటగిరి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండల కేంద్రంలోని అంగడిబజార్‌లో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. సంతకు వచ్చే ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు మహిళా సంఘం సభ్యులు జ్యోతితెలిపారు. జూన్ వరకు చలి వేంద్రం కొనసాగిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మహిళా సంఘం సభ్యులు ప్రణిత, భాగ్యలక్ష్మి, మంజుల, స్వాతి, చంద్రకళ, శ్రీదేవి, సంతోషి, దేవి, వసూద తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

రెంజల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా న్యాయం జరుగుతోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మొబిన్‌ఖాన్ అన్నారు. సోమవారం కందకుర్తి, పేపర్‌మిల్, నీలా గ్రామంలో లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి సుమన్, నాయకులు గయాసోద్దీన్, సాయిరెడ్డి, ధనుంజయ్, బాబన్న, రాంచందర్, అంజయ్య, సిరాజ్, ఇందిరా, స్వప్న, విజయ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో హనుమాన్ స్వాముల మండల భిక్ష

కోటగిరి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సోమవారం హనుమాన్ స్వాములు మండల భిక్ష ఏర్పాటు చేశారు. గ్రామంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి హనుమాన్ స్వాములకు మండలభిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హనుమాన్‌స్వాములు తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తుంది'



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బోధన్‌రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగ ప్రజాస్వామ్య స్థిరత్వాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని పలు వార్డులలో కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాలతో వివిధ వార్డుల్లో పర్యటించి ప్రజలకు వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పాషా మొయినోద్దీన్, హరికాంత్ చారి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంపల్లి ఎల్లమయ్య, మాజీ కౌన్సిలర్ శరత్ రెడ్డి, నాయకులు తలారి నవీన్, ఉర్దూ ఘర్ కమిటీ సభ్యులున్నారు.

కోటగిరి : రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలంగాణ గిరిజన కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి పేర్కొన్నారు. పొతంగల్ మండల కేంద్రంలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ విలువలకు తూట్లు పొడుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతు, నాయకులు చాంద్ పాషా పాల్గొన్నారు.

రెంజల్ : బీజేపీ తప్పుడు విధానాలను తిప్పి కొట్టేందుకే జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రలు నిర్వహిస్తున్నామని మండల ఇన్‌చార్జి సుమన్, మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్ అన్నారు. సోమవారం మండలంలోని నీలా, పేపర్‌మిల్, కందకుర్తి గ్రామాలలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గయాసోద్దీన్, బాబు, ఎంఎల్ రాజు పాల్గొన్నారు.

రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు

● నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నిజామాబాద్ ఏఎంసీ డైరెక్టర్



పచ్చలనడ్కుడలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్

నందిపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు కోరారు. సోమవారం నందిపేట మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పెంట ఇంద్రుడు మాట్లాడుతూ రైతులు వరిధాన్యంను ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. ఈ పంట సీజన్‌లో సైతం సన్న రకాలకు ప్రభుత్వం బోనస్ ఇస్తుందని, ఈ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి హామీ ఇచ్చినట్లు పెంట ఇంద్రుడు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ సిలిండర్ లింగం, స్థానిక నాయకులు, ఏకేపీ ఉద్యోగులు, మహిళలు, రైతులు తధితరులు ఉన్నారు.

వేల్పూర్: మండలంలోని పచ్చల నడ్కుడ సొసైటీలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం చైర్మన్ లింబారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మానిటరింగ్ ఆఫీసర్ దినేష్, సొసైటీ డైరెక్టర్లు గట్టువతల నర్సారెడ్డి, ఆశీల గంగాధర్, అంకం నాగమల్లేష్, కొమ్ముల రామన్న, సొసైటీ కార్యదర్శి స్వామి, సిబ్బంది, రైతులు తది తరులు పాల్గొన్నారు.

కోటగిరి : రైతులకు గిట్టుబాటు ధరను అందించేందుకు ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వర్ని మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబా సూచించారు. రుద్రూరు మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తారాబాయి తదితరులు పాల్గొన్నారు.

నవీపేట : మండలంలోని కమలాపూర్, పత్తేనగర్, సిరన్‌పల్లి, తుంగిని, నాళేశ్వర్‌లలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఐకేపీ ఆధ్వర్యంలో ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కమలాపూర్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, మహిపాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, కోటిరెడ్డి, రాంరెడ్డి, ఏపీఎం భూమేష్ గౌడ్, గ్రామ సంఘం అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి తదితరులున్నారు. పొతంగల్ మండలంలోని సోంపూర్, కొల్లూర్ గ్రామాలలో సోమవారం ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం బస్వంత్ రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గంగాధర్, సంజీవ్, సాయినాథ్, దిగంబర్ పటేల్, జీవన్ రావు, సంపత్ కుమార్, జగన్, దిగంబర్, ఐకేపీ సీసీలు సాయిబాబా, గ్రామ సంఘం సభ్యులు లలిత, జ్యోతి, శారద తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం సొసైటీలద్వారా ఏర్పాటు చేస్తున్న వరి కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకుంటు మద్దతు ధరలు పొందాలని చౌట్‌పల్లి సహకార సంఘం చైర్మన్ కుంట ప్రతాప్ రెడ్డి అన్నారు. సోమవారం చౌట్‌పల్లి సొసైటివద్ద వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతులు నిబంధనలకు లోబడి కేంద్రాలను వరి దాన్యాన్ని తరలించాలన్నారు. కార్యక్రమంలో సొసైటి డైరెక్టర్‌లతో పాటు రైతులు సత్యం రెడ్డి, సూర స్వామి, మోహన్ నాయక్, కార్యదర్శి శంకర్ సిబ్బంది పాల్గొన్నారు.

రెంజల్ : రైతు తాను పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి అధిక లాభాలు పొందాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్ అన్నారు. సోమవారం మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐకేపీ ఏపీఎం చిన్నయ్యతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు సాయిబాబా గౌడ్, సాయరెడ్డి, జావీదోద్దీన్, కుర్మె శ్రీను, ఇందిరా రెడ్డి, యోగేష్, షౌకత్, మల్లేష్, సీసీ శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బోధన్‌రూరల్ : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని హున్స సహకార సంఘం అధ్యక్షులు మందర్నా రవి అన్నారు. సోమవారం సాలూర మండలంలోని హున్స గ్రామంలో సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బోధన్ మార్కెట్ కమిటీ ఇన్‌ఛార్జి చైర్మన్ చీల శంకర్, సొసైటీ ఉపాధ్యక్షులు వినోద్ బాబా, ఏఈవో శ్రావణి, సొసైటీ డైరెక్టర్లు మన్నే భూమన్న, ఖాజాపూర్ అశోక్, సంజీవ్ పటేల్, శివ కుమార్, రాములు, మైసయ్య, మాజీ ఎంపీటీసీ పల్లె గంగారాం, శంకర్, మారుతి, సొసైటీ సీఈవో హన్మంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి సొసైటీ పరిధిలోని గండి మాసానిపేట్‌లో సోమవారం ఆర్డీవో మన్నె ప్రభాకర్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రజిత రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డీటీ సురేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రామ్ రెడ్డి, సొసైటీ చైర్మన్ నర్సింలు, వైస్ చైర్మన్ ప్రశాంత్ గౌడ్, కార్యదర్శి విశ్వనాథం, డైరెక్టర్లు నాయకులు తిరుపతి శంకరయ్య, సిబ్బంది, మల్లేష్ పాల్గొన్నారు.

గాంధారి : మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో వరి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీబీ జిల్లా డైరెక్టర్‌సాయికుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకుల లక్ష్మన్, మాజీ ఎంపీటీసీ తూర్పురాజులు, తాడ్వాయి సంతోష్‌బాలరాజు, బాలయ్య, బాబా, శంకర్, ఈశ్వర్‌గౌడ్, లైన్‌రమేష్, షైమద్,మదర్ తదితరులు పాల్గొన్నారు.

నాయకులు భారీగా తరలిరండి

● ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): నాయకులు సభకు తరలిరావాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. వేల్పూర్‌లో సోమవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం జరిగి 25 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా వరంగల్ లో ఈ నెల 27న జరుగనున్న బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ సభకు బాల్కొండ నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరు కావాలని ఆయన కోరారు. బీఆర్ఎస్ పార్టీపై నోటికచ్చినట్లు వాగుతున్న వారందరికి సమాధానం చెప్పడానికే వరంగల్ సభ వేదిక కానుందన్నారు. నియోజకవర్గం నుంచి ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యర్తలు వరంగల్ సభకు పెద్ద తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. అందుకు గ్రామగ్రామాన సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని గ్రామ స్థాయి నాయకులకు సూచించారు.

హిందూధర్మం ఎంతో గొప్పది'

హిందూధర్మం ఎంతో గొప్పదని, ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బాల్కొండ నియోజ కవర్గంలో ఆంజనేయ స్వామి మాలధారన వేసుకున్న స్వాములకు సోమవారం వేల్పూర్ జంబి హనుమాన్ వద్ద మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి బిక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు, ఆంజనేయ స్వామి మాల ధారణ స్వాములు, పాల్గొన్నారు.

హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం

ఆర్మూర్ రూరల్ : ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో రాష్ట్రప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం ఆర్మూర్ మున్సిపల్ పరిధి పెర్కిట్‌లోని ఎంఆర్ గార్డెన్‌లో ఆర్మూర్ నియోజకవర్గ ముఖ్య నాయ కులు కార్యకర్తలతో ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభను విజయ వంతం చేయడానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో నియోజక వర్గ ఇంచార్జ్ రాజేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, నాయకులు గంగమోహన్ చక్రు, లింబంద్రి గౌడ్, మదర్, మాజీ ఎంపీపీలు వాకిడి సంతోష్‌రెడ్డి, మస్త ప్రభాకర్, చుక్కి సుధాకర్, దేవేందర్, సొసైటీ చైర్మన్‌లు కార్తిక్ రెడ్డి, మహిపాల్, నక్కర భూమేష్, వెల్మ రాజన్న, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

గిరిరాజ్ కళాశాల విద్యార్థుల శ్రమదానం

మోపాల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగ్‌పల్లిలో సోమవారం గిరిరాజ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. నాలుగు రోజుల నుంచి గ్రామాల్లో విద్యార్థులు శ్రమదానం కార్యక్రమాన్ని ప్రోగ్రాం ఆఫీసర్ సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. గ్రామస్తులకు విద్య, వైద్యం, మూడనమ్మకాలపై, మాదక ద్రవ్యాలు, పచ్చదనం, నీటివనరుల గురించి అవగాహన కల్పించారు.

ధర్పల్లి: మండలంలోని సీతాయిపేట గ్రామంలో ధర్పల్లి డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం అధికారి కుమారస్వామి తెలిపారు. ఈనెల 7 నుంచి 13 వరకు ఈ శిబిరం కొనసాగనుంది. వారం రోజుల పాటు జరిగే ఈ శిబిరంలో గ్రామంలో సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టనున్నారు కార్యక్రమంలో రాంచందర్ వాలంటీర్లు పాల్గొన్నారు.

పోషణ పక్షం షెడ్యూల్ విడుదల

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఏడో జాతీయ పోషణ పక్షం - 2025 షెడ్యూల్‌ను సోమవారం జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈనెల 8 నుంచి 22 వరకు నిర్వహించనున్న పోషణ పక్షం షెడ్యూల్‌ను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి రాజశ్రీ, డీఆర్‌డీవో సాయాగౌడ్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రోబోటిక్స్ ఎక్స్‌పో

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పులాంగ్ వద్ద గల స్టార్‌వరల్డ్ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన రోబోటిక్స్ ఎక్స్‌పో 2కె 25 ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు విద్యార్థులు ప్రదర్శించిన వివిధ ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. ముఖ్యంగా స్మార్ట్ రైల్వే గేట్ సిస్టమ్, స్మార్ట్ హెల్మెట్ ఫర్ యాక్సిడెంట్ డిటెక్షన్, ఫైర్ ఫైటింగ్ రోబోట్ తదితర ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. ప్రస్తుత సమాజంలో రోబోలతో రాబోయే ప్రపంచం ఉండనున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే విద్యార్థుల్లో రోబోటిక్స్‌పై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల చైర్మన్ ధర్మరాజ్ తెలిపారు.

రెమ్యూనరేషన్‌ను సక్రమంగా చెల్లించాలి

నిజామాబాద్‌అర్బన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి మూల్యాంకనం డబ్బులను ఈ సంవత్సరం ఎలాంటి కోతలు లేకుండా సకాలంలో చెల్లించాలని పీఆర్‌టీయూ తెలంగాణ ఉమ్మడి జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శులు కనకపురం రవీందర్, జనపాల లక్ష్మిరాజ్యంలు సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. గత ఏడాది పదోతరగతి మూల్యాంకనం డబ్బులు కోత విధించి ఇచ్చారని ఈ సంవత్సరం అలా కాకుండా సకాలంలో చెల్లించాలని కోరారు. దీనికి స్పందించిన డీఈవో సకాలంలో మూల్యాంకనం డబ్బులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గంగాధర్, జావిద్ పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణం



రామాలయంలో పట్టాభిషేకం దృశ్యం

బోధన్‌రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని శ్రీరామాలయంలో సోమవారం పట్టాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శ్రీరాముడి పట్టాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు.

వేల్పూర్ : పడిగెల గ్రామంలోని ఊరచెరువులో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం దేవత ఉత్సవమూర్తులకు భక్తి శ్రద్ధలతో చక్రస్నానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉగాది నుంచి ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు ముగిశాయి ఉదయం పూర్ణాహుతి, నగవల్లి, వాసుదేవపూజ, దేవత ఉద్వాసన, బలి అనంతరం ఉత్సవ మూర్తులకు మహిళలు సం తానం కోసం పోలు దండలు వేశా రు. అనంతరం బాజా భజంత్రిలతో ఉత్సవ మూర్తులను స్థానిక ఊరచె రువు వరకు తీసుకువెళ్లి వేదపం డితులు రఘురామచార్యుల మంత్రోచ్చరణల మధ్య చక్రస్నానం నిర్వహించారు.

మోస్రా : మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో రామచంద్ర స్వామి వారి పట్టాభిషేకం మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జిల్లా రాజకీయ నాయకులు పాల్గొన్నారు. పట్టాభిషేకం అనంతరం సీతారామచంద్ర, లక్ష్మణుల విగ్రహాలను గ్రామంలోని ప్రధాన వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటి చైర్మన్ కేశవేణు, విశ్వహిందూ పరిషత్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



పట్టాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

● డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి



శంకుస్థాపన చేస్తున్న డీసీసీబీ చైర్మన్

వేల్పూర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తుందని డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి అన్నారు. వేల్పూర్ సొసైటీ పరిధిలోని లక్కోర గ్రామంలో రూ.9 లక్షలతో నిర్మించనున్న వంద మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాంనకు సోమవారం డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్లు భూమన్న, శంకర్, సొసైటీ వైస్‌చైర్మన్ బైరి శ్రీధర్, డైరెక్టర్లు నాయకులు పాల్గొన్నారు.

జుక్కల్ అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న నాయకులు

బిచ్కుంద, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని మండలాల అభివృద్ధిపై దృష్టి పెడుతూ ముందుకు సాగుతున్నట్లు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. సోమవారం బిచ్కుంద పట్టణాన్ని మున్సిపాలిటీ ఏర్పాటుకు కృషిచేసినందుకు కందర్‌పల్లి నుంచి ఎమ్మెల్యేకు బైక్‌ర్యాలీతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో మఠాధిపతి సోమలింగాశివాచార్యులు, మల్లికార్జున్ అప్పశెట్కార్, పీసీసీ డెలిగేట్ సభ్యుడు విఠల్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు గంగాధర్, నాగనాథ్‌పటేల్, నౌషానాయక్, సోహెల్‌శెట్కార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు కనీస వేతన చట్టం అమలు చేయాలి

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కూలీలకు కనీస వేతన చట్టం అమలు చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సారాసురేష్ అన్నారు. సోమవారం మండలంలోని హాసాకొత్తూర్ గ్రామశివారులో కొనసాగుతున్న ఉపాధి కూలీల పనుల చోట సమావేశం నిర్వహించారు. బయోమెట్రిక్ విధానాన్ని రద్దుచేస్తూ కూలీలందరికీ డబ్బులు చెలించాలని అన్నారు. సమావేశంలో ఉపాధి కూలీలతో పాటు నాయకుడు వి.అశోక్ పాల్గొన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవీపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అబ్బాపూర్(ఎం)కు చెందిన బట్టు నరేష్(35) అనే వ్యక్తి సోమవారం తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ వినయ్ తెలిపారు. కూలిపని చేసే నరేష్ సోమవారం మధ్యాహ్నం అనారోగ్యంతో ఉన్న తన తల్లిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని తిరిగి ఇంటికి వచ్చాడని అన్నారు. అనంతరం తనకు 2500రూపాయలు అవసరం ఉందని, సంబంధిత డబ్బులను ఇవ్వాలని తండ్రి నడిపి ఒడ్డెన్నను కోరగా అతడు నిరాకరించాడని ఎస్ఐ పేర్కొన్నారు. ఇంట్లోని గదిలోకి వెళ్లిన నరేష్ ఉరి వేసుకున్నాడని దీంతో కుటుంబ సభ్యులు తలుపులను పగులగొట్టి కొన ఊపిరితో ఉన్న నరేష్‌ను మండల కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడని ఎస్ఐ వివరించారు. మృతుడికి భార్య గౌతమి, నాలుగు సంవత్సరాల వయసు గల కుమారుడు ఉన్నాడని, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎంపీడీవోను కలిసిన కారోబార్లు

డొంకేశ్వర్ , ఏప్రిల్06(ఆంధ్రజ్యోతి):డొంకేశ్వర్ ఎంపీడీవోగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో బ్రహ్మానందంను మండల కారోబార్లు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం వారితో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్య లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో కారోబార్ల సంఘం అధ్యక్షుడు రంజిత్ గౌడ్ పాల్గొన్నారు.

రెండు ఇళ్లల్లో చోరీ

మహమ్మద్‌నగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాన్సువాడ- ఎల్లారెడ్డి రోడ్డు పక్కన ఉన్న బూర్గుల్ గ్రామపరిధిలో రెండు ఇళ్లల్లో చోరీ జరిగినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. బూర్గుల్ గ్రామానికి చెందిన మహబూబ్, తప్సిస్లాబేగం ఇంట్లో రాత్రి 12 గంటలకు ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. తలుపులు, గొల్లెం పగలగొట్టి బీరువాలో ఉన్న 40 తులాల పట్టి గొలుసులు, ముక్కుపోగులను, ఒక బియ్యం సంచి, రూ.2వేలను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈ విషయం అర్థరాత్రి పోలీసులకు తెలియజేయగా వారు వచ్చి ఇంటి పరిసరాల ప్రాంతాల్లో పరిశీలించారు. కాగా తిరిగి వెళ్తున్న సమయంలో సాయిబాబా గుడిలో తలదాచుకుని ఉన్న ఓ దొంగను, బైకును స్థానికులు పట్టించారు.

చెక్కుల పంపిణీ

ఆర్మూర్ టౌన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీవీఆర్ భవన్‌లో లబ్ధిదారులకు సీఎంఆర్ చెక్కులు పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు బాధితులకు సీఎంఆర్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, కాంగ్రెస్ నాయకుడు పండిట్ పవన్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ సెంటర్‌ను వినియోగించుకోవాలి

గాంధారి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో సోమవారం కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌ను ఎస్ఐ ఆంజనేయులు ప్రారంభించారు. తెలంగాణ స్టేట్‌లీగల్ సర్వీస్ అథారిటీ, కామారెడ్డి డిస్ట్రిక్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేశామన్నారు. కార్యక్ర మంలో తహసీల్దార్ రేణుకచవన్, ఎంపీడీవో రాజేశ్వర్, పంచాయతీ సెక్రటరి పాల్గొన్నారు.

లింగంపేట : మండల కేంద్రంలోని గ్రామపంచాయితీలో సోమవారం సామూహిక మధ్యవర్తిత్వ కేంద్రాన్ని ఎస్సై వెంకట్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి శ్రావన్‌కుమార్ ఉన్నారు.

నిజాంసాగర్ : ఎంపీడీవో కార్యాలయంలో కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మనోజ్‌కుమార్, మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి, ఎస్ఐ శివకుమార్‌లు ఉన్నారు.

మద్నూర్ : మధ్యవర్తిత్వ కేంద్రాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని మద్నూర్ ఎస్సై విజయ్‌కొండ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో కమ్యూనిటీ మీడియేషన్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామాల్లో చిన్నచిన్న తగాదాలు, గొడవలు జరిగి పోలీస్‌స్టేషన్ వరకు రాకుండా ముందుగా సామూహిక మధ్యవర్తిత్వ కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాణి, తహసీల్దార్ ముజీబ్, గ్రామపంచాయతీ కార్యదర్శి సందీప్, కమ్యూనిటీ మెడియేషన్ సభ్యులు రిటైర్డ్ ఏఎస్ఐ అశోక్ మోరే, సురేష్ ఉడుతవార్, బిచ్కుంద కోర్టు ఉద్యోగులు రామకృష్ణ, పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి విద్యాశాఖ అధికారిగా రాజులు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల విద్యా శాఖ అధికారిగా రాజులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎల్లారెడ్డిలో పని చేసిన వెంకటేశం ఇటీవల పదవీ విరమణ పొందారు. గండి మాసానిపేట్ జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న రాజులను ఎంఈవోగా నియమిస్తూ డీఈవో రాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యాయులు జోసి శ్రీధర్, రమేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉన్నత విద్యపై విద్యార్థులకు అవగాహన

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్ 07 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చావుని తండా, అంజనీతండా, లింగంపల్లి, పెద్దకొడప్‌గల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం పెద్దకొడప్‌గల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండ ల విద్యాధికారి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ల్యాబ్ యాక్టివిటీస్ తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ విధంగా చేయడం ద్వారా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉన్నత పాఠశాలలో ఏ విధమైన ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలు ఉంటాయో అవగాహన కలుగుతుందన్నారు.



ఉపాధి హామీ పనులు చేయిస్తున్న క్షేత్ర సహాయకులు

వేతనాలు లేకుండా పనిచేసేదెలా..!?

● ఇబ్బందులు పడుతున్న ఉపాధి హామీ సిబ్బంది
● కుటుంబ పోషణ భారమవుతుందని ఆవేదన
● ప్రభుత్వం వెంటనే వేతనాలు మంజూరు చేయాలి

తాడ్వాయి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మొత్తం 18 గ్రామ పంచాయతీలకు 18 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆరుగురు మేట్ల ద్వారా జాతీయ ఉపాధి హామీ పథకం కింద వచ్చిన ప్రతి కూలీకి వంద రోజుల పని కల్పించడమే లక్ష్యంగా ఉపాధి హామీ సిబ్బంది పనిచేస్తుంది. అలాంటి ఉపాధి హామీ సిబ్బందికి నాలుగు నెలల నుంచి జీతాలు రాక జీతం ఎలా చేయాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. ప్రతీరోజు దరఖాస్తు చేసుకున్న కూలీకి వందరోజుల పని కల్పించే ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లు, మండల ఏపీవోలకు తదితర సిబ్బందికి నాలుగు నెలల నుంచి వేతనాలు రావడం లేదని అంటున్నారు. వేసవి కాలం దృష్ట్యా పని కల్పించి పనిని ఎప్పటి కప్పుడు మానిటరింగ్ చేయాల్సిన అధికారుల చేతిలో చిల్లి గవ్వ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. తమకు నాలుగు నెలల నుండి జీతాలు రాక జీతం ఎట్లా చేయాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ వేతనాలు విడుదల చేసి తమను తమ కుటుంబ సభ్యులను ఆదుకోవాలని ఉపాధి హామీ సిబ్బంది అంటున్నారు.

● **వేతనాలు రాక నాలుగు నెలలు అవుతుంది**



ఉపాధి వేతనాలు రాక నాలుగు నెలలు అవుతుంది. తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చితంగా వంద రోజులు పని కల్పించామని భారం పెడుతుంది. దానికి తగ్గట్టుగా పని చేస్తున్నాం. కాని సరిగ్గా వేతనాలు రావడం లేదు. ప్రభుత్వం స్పందించి వేతనాలు విడుదల చేయాలి.

- సంతోష్, ఫీల్డ్ అసిస్టెంట్

● **పని భారం ఎక్కువ అవుతుంది**



పని భారం ఎక్కువ అవతుంది. వేసవి కాలంలో వచ్చిన ప్రతీ కూలీకి వంద రోజుల పని కల్పింస్తున్నాం. కూలీలకు టైమ్‌లో పైసలు రాక ఇబ్బంది పడుతున్నారు. అటు కూలీలకు, ఇటు సిబ్బందికి సరైన సమయంలో వేతనాలు రాకపోతే పని ఎట్లా చేస్తారని అంటున్నారు. ప్రభుత్వమే జీతాలు విడుదల చేసి ఆదుకోవాలి.

- శంకర్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల మండల అధ్యక్షుడు

నిధుల కోసం మాజీ సర్పంచ్‌ల నిరీక్షణ

● బిల్లులు రాక, వడ్డీలు కట్టలేక సతమతం ● గ్రామాలు అభివృద్ధి చేస్తే అప్పులే మిగిలాయని ఆవేదన
● తెచ్చిన డబ్బులకు పెరిగిపోతున్న వడ్డీ ● పదవీ కాలం ముగిసి ఏడాదైనా మంజూరు కాని నిధులు



కళ్యాణి గ్రామ పంచాయతీ భవనం

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో మాజీ సర్పంచ్‌లు నిధులు మంజూరు కాకపోయినప్పటికీ స్వతహాగా బయట నుంచి అప్పులు తెచ్చి గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టి పనులు పూర్తి చేశారు. అభివృద్ధి లక్ష్యంగా పని చేసిన వారికి అప్పులే మిగిలాయి. 2022, 2023లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని ఒత్తిడి తీసుకురావడంతో గత్యంతరం లేక నాటి సర్పంచ్‌లు బయట నుంచి పెద్ద మొత్తంలో అప్పులు తీసుకువచ్చారు. ఒక్కొక్క గ్రామ పంచాయితీకి మాజీ సర్పంచ్‌లు సుమారు ఐదు నుంచి రూ.20 లక్షల వరకు పనులు పూర్తి చేసి బిల్లులు రాక ఎదురు చూస్తున్నారు. రెండేళ్ల గడిచినప్పటికీ గత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయలేదు. దీంతో నాటి సర్పంచ్‌లు గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోవడంతో అవి ఎలా తీర్చాలని మనోవేదనకు గురవుతున్నారు. జిల్లాలో 22 మండలాలు, 527 గ్రామ పంచాయితీలు ఉన్నాయి. గతంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ఎస్డీఎఫ్ నిధులు మంజూరు చేస్తామని చెప్పి, నిధులు మంజూరు చేయలేదని మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పెండింగ్‌లోనే ఉన్నాయి. నాటి గ్రామ సర్పంచ్‌లు అభివృద్ధి పనుల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీ మీద వడ్డీలు పెరిగి పోతు న్నాయని మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● **రెండేళ్లుగా పెండింగ్‌లోనే బిల్లులు ఇలా..**

గ్రామాలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో మాజీ సర్పంచ్‌లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు మంజూరు కాకపోయినప్పటికీ బయట నుంచి అప్పులు తీసుకు వచ్చి గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. అందులో భాగంగా పల్లె ప్రకృతి వనాల నిర్మాణ పనులు, వీధి దీపాలు, శానిటేషన్, మంచి నీటి బావి మోటార్ల మరమ్మతులు, నర్సరీల నిర్వహణ, మోటార్ల, స్టార్టర్ల కొనుగోలు, అవెన్యూ ప్లాంటేషన్, మొక్కల కొనుగోలు, శ్మశాన వాటిక, డంపింగ్ యార్డు నిర్మాణ పనులు, ట్రాక్టర్ ఈఎంఐ, డీజిల్ మెయింటెనెన్స్ ఖర్చులతో పాటు సీసీ రోడ్ల నిర్మాణలు, సైడ్ కాలువల నిర్మాణ పనులు చేపట్టారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలల క్రితం మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బకాయిల వివరాలను ఆయా జిల్లా కలెక్టర్ల ద్వారా నివేదిక తీసుకుంది.

● **ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి..**

గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో బయట అప్పులు తీసుకు వచ్చి గ్రామాలలో శానిటేషన్, వీధి దీపాలు, మోటార్ల మరమ్మతులు ట్రాక్టర్, డిజిల్, డంపింగ్ యార్డు, సీసీ పనులు చేశాం. సుమారు రూ. లక్షల రూపాయలు గ్రామ అభివృద్ధి కోసం ఖర్చు చేశాను. తెచ్చిన డబ్బులకు వడ్డీల మీద వడ్డీలు కట్టలేక పోతున్నాం. ప్రభుత్వం స్పందించి మాజీ సర్పంచ్‌ల బిల్లులు విడుదల చేయాలని కోరుతున్నాం.

- రఘువీర్‌గౌడ్, మాజీ సర్పంచ్, కళ్యాణి గ్రామం

● **ప్రభుత్వం నుంచి బిల్లులు రాగానే అందజేస్తాం**

గ్రామాల్లో మాజీ సర్పంచ్‌లు అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపాం. గత రెండేళ్లుగా ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు మంజూరు కాలేదు. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే మాజీ సర్పంచ్‌ల పెండింగ్ అభివృద్ధి పనుల బిల్లులను వారికి అందజేస్తాం.

- మురళీ, జిల్లా పంచాయితీ అధికారి, కామారెడ్డి

రసవత్తరంగా కుస్తీ పోటీలు



మెంగారంలో కుస్తీ పడుతున్న మల్లయోధులు

లింగంపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మెంగారంలో సోమవారం కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. శ్రీరామ నవమి సందర్భంగా ఆలయం వద్ద కుస్తీ పోటీలను ఏర్పాటు చేశారు. కుస్తా పోటీలలో పాల్గొనేందుకు మండలంలోని వివిధ గ్రామాలతో పాటు జిల్లాలోని వివిద ప్రాంతాలనుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. చివరి కుస్తీలో గెలుపొందిన విజేతకు రెండు తులాల వెండి కడియం బహుమతిగా అందజేశారు.

ఖిల్లా రామాలయంలో శ్రీరాముని పట్టాభిషేకం

● పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



స్వామి వారి విగ్రహాలను తీసుకొస్తున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖిల్లా రామాలయంలో ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాముని పట్టాభిషేకంతో పాటు అభిషేకంలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులను తీసుకొని ఆలయం చుట్టూ తిరిగి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం అర్చకులు సుమిత్ శర్మ, సుమిత్ పాండే ఆధ్వర్యంలో శ్రీరామునితో పాటు సీత, లక్ష్మణుడి కి ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించి పట్టాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడారు. ప్రజలు ఎల్లప్పుడు సుభిక్షంగా ఉండాలని శ్రీరాముని పరిపాలన లాగా కేసీఆర్ పాలన ఉండేదన్నారు. అనంతరం బాజిరెడ్డి గోవర్ధన్‌ను కమిటీ సభ్యులు శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్‌మోహన్, నాయకులు సాంబారి మోహన్, ఆలయ చైర్మన్ శాంతయ్య, శక్కరికొండ క్రిష్ణ, ఒడ్డం నర్సయ్య, పద్మరావు, రఘునందన్ రావు, ప్రతాప్‌రెడ్డి, లక్ష్మీనర్సయ్య, పాషా, గిరి, సాయరెడ్డి, వీడీసీ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సీతారాముల పట్టాభిషేకం



గుండారం గ్రామంలో పూజలు చేస్తున్న దృశ్యం

నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పర్వ దినాన్ని పురస్కరించుకొని అంగరంగ వైభవంగా కల్యాణం జరుపుకున్న సీతారామ చంద్రస్వామి సోమవారం పట్టాభి షేకం నిర్వ హించుకున్నారు. సీతా రామచంద్ర స్వామి ఆలయాల్లో భక్తుల రామనామ స్మరణ వేద పండితుల వేద మంత్రోశ్చరణలతో స్వామివారి అస్త్రా లైన కిరీటం, శంఖం, చక్రం, ధనస్సు, ఖడ్గం, చామలం ధరింపజేశారు. స్వామివారి నామాలను పఠిస్తూ అర్చకులు శాస్త్రోక్తంగా పట్టాభిషేకం జరిపారు. గుండారం గ్రామంలోని సీతా రామ చంద్రస్వామి దేవాలయంలో ఉదయం వేదపండితులు వేణుఆచార్య వేద మంత్రాలు పఠించగా అర్చకులు నరేంద్ర మూర్తి, ఫణికృష్ణ ఆచార్య పట్టాభిషేక కార్యక్రమం నిర్వహించి పుష్ప యాగం చేశారు. పుష్పయాగంలో వివిధ దేవతలను స్థాపితం చేసి ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా సీతారాముల రథోత్సవం

భక్తుల గోవిందనామస్మరణ, కళాకారుల నాట్య ప్రదర్శనతో సీతా రామచంద్రస్వామి రథోత్సవం వైభవంగా సాగింది. సుభాష్‌నగర్ రామాలయంలో సీతారాముల వారు ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఆంజనేయ లక్ష్మణుడు సమేతుడై సీతారామ చంద్రస్వామి భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయం నుంచి ప్రారంభమైన రథోత్సవం జెడ్పీ చౌరస్తా, ఎస్‌బీఐ బ్యాంక్ చౌరస్తా మీదుగా ఆలయం వరకు సాగింది. రథోత్సవంలో వేద పండితులు వేదమంత్రాలు పఠించగా అర్చకులు ప్రబంధ పారాయణం, భక్తుల కోలాటాలతో నీరాజనాలు పలికారు. రథో త్సవం దారి పొడవున మంగళ హారతులతో, కొబ్బరి కాయలతో స్వామికి ఘన స్వాగతం చేశారు. ఈ కార్యక్రమంలో యజ్ఞాచార్యులు సముద్రాల శ్రీధరా చార్య, అర్చకులు తులసీ మురళీధర చార్య, రాఘవ చార్య, గోవర్ధనం కృష్ణమా చార్య, సేనాపతి వేణుగోపాలాచార్య, కలకుంట్ల నర్సింహా మూర్తి, సముద్రాల రామాచార్య పాల్గొన్నారు.

శ్రీ రామమఠంలో కమనీయంగా సీతారాముల కల్యాణం



సీతారాముల వారి కల్యాణ వేడుకలు నిర్వహిస్తున్న మఠం పీఠాధిపతుల దృశ్యం



సీతారాముల కల్యాణానికి హాజరైన భక్తులు

ఎడపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ రామమఠంలో సోమవారం సీతారాముల వారి కల్యాణ వేడుకలు శ్రీ రామమఠ పీఠాధిపతులు కమనీయంగా నిర్వహించారు. రాముల వారిని గ్రామంలో గల వీర హనుమాన్ మందిరం దగ్గర నుంచి సీతమ్మ వారిని గ్రామంలో గల మార్కండేయ మందిరం నుంచి బాజా భజంత్రీలతో ఊరేగింపుగా శ్రీరామమఠానికి తీసుకు వచ్చి సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రామమఠ పీఠాధిపతులు జయరామ్ మహారాజ్ మాట్లాడుతూ అనాదిగా వస్తున్న ఆచారంలో భాగంగా నవమి రోజున జన్మదిన వేడుకలు నిర్వహించి, దశమి రోజున సీతారాముల వారి కల్యాణం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం కళ్యాణ వేడుకలు నిర్వహించడం జరిగిందన్నారు. స్వామి వారి కల్యాణం అనంతరం భక్తులకు ఆత్మేల శ్రీనివాస్ అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలలో గ్రామ పెద్దలు, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వరిపై తెగుళ్ల దాడి

● చేతికి వచ్చే దశలో అధికంగా తెల్ల గొలక ● గింజలు గట్టిపడకుండానే దెబ్బతింటున్న వరి ● ఎన్ని మందులు కొట్టినా దక్కని ఫలితం



వరిపై తెగులు సోకిన దృశ్యం



వరిపంటపై తెల్లగొలక సోకిన దృశ్యం

డొంకేశ్వర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వరిపంటకు మాయదారి రోగం ఏదో సోకడంతో రైతులు పరేషన్‌లో పడ్డారు. ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకుని అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి తీరా పంట చేతికి వస్తుందన్న గ్యారంటీ లేని పరిస్థితులు ఏర్పడ్డాయి. అసలే వానకాలం భారీ వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. దిగబడి రాక రైతులు పెట్టుబడుల మీద పడ్డాయి. ఈ యాసంగిలోనైనా పంటలు బాగా వస్తుందని గంపెడాశతో పెద్ద ఎత్తున రైతులు వరి సాగు చేశారు. తీరా చేను పొట్ట దశలో కు వచ్చింది. వరి ఈనుతున్న తరుణంలో బయటకు వచ్చిన వరికి గింజలు గట్టిపడకుండా తెల్లగా తాలూ పోయి అలాగే నిలబడిపోవడంతో రైతుల పరిస్థితి ఆగమ్య గోచరంగా తయారైంది.

9వేల ఎకరాల్లో వరి సాగు

మండలంలో ఎత్తిపోతల పథకం ద్వారా పంటలకు పుష్కలంగా నీరు ఉండడంతో ఈ యాసంగిలో రాకార్డు స్థాయిలో 9వేల ఎకరాలలో వరి పంట సాగయింది. మండలంలో చాలా ప్రాంతాలలో ముందుగా వేసిన వరిపంట ఈని గింజలు ఏర్పడుతున్నాయి. ఈ క్రమంలో చాలా గ్రామాలలో ఈనిన వరిచేను తెల్లబడి నిలబడుతున్నాయి. డొంకేశ్వర్ మండలంలో ఆయా గ్రామాల్లో వరి ముందు నాటిన వరి పంట కోతకు వచ్చింది. రెండో ధశ నాటిన పంటలలో ఎక్కువగా తెల్ల గులకా ఏర్పడుతుంది. రెండో దఫా నాటిన వరి కొద్ది రోజుల్లో పంట చేతికి వస్తుందన్న రైతులకు ఈ మాయదారి రోగం ఆందోళన కలిగిస్తుంది.

ఇష్టం వచ్చిన మందులు

వరిచేనుపై రైతులకు ఇష్టం వచ్చిన మందులు పిచికారి చేస్తున్న ఫలితం కనబడడం లేదు. నాటు వేసినప్పటి నుంచి వాతావరణ పరిస్థితుల్లో వరి ఎదుగకుండా ఎర్రగా ఉండడం నాటినప్పటి నుంచి ఇప్పటి వరకు వరికి ఏదోఒక చీడపీడతో వరిరైతులు మందులను పిచికారి చేశారు.

మెడ విరుపు, ముగిపురురుగు, అగ్గి తెగులు

వరి చేను పంట ఈని గింజలు గట్టిపడకుండా తాలుపోవడం మొగిపురుగు, అగ్గి తెగులు లక్షణాలని వీటి నివారణకు ఎకరానికి అజోక్సీస్ట్రోబిన్ 11 శాతంతో టెబుకోనజోల్ 18.3 శాతం 200 మిల్లీ లీటర్లు మందులు పిచికారి చేయాలని ఏవో మధుసుదన్ సూచించారు.

తెల్లగొలక అధికంగా పోతుంది

● రాజేశ్వర్, రైతు, దత్తాపూర్



వరి నాలుగు ఎకరాలు నాటిన ప్రస్తుతం పొట్ట దశలో ఉంది. తెల్లగొలక అధికంగా పోతుంది. ఎన్ని మందులు పిచికారి చేసిన లాభం లేదు. వరి పుట్టలో నుంచి బయటకు వచ్చిన తరువాత గింజ తెల్లగా ఏర్ప డుతుంది. దీంతో దిగుబడి తగ్గి పెట్టు బడులు కూడా నిండని పరిస్థితి ఉంది.

తెల్లగొలక ప్రభావంతో దిగుబడి తగ్గే అవకాశం

● చిన్నారెడ్డి, రైతు, నడ్కుడ



వరిసాగు చేస్తున్న రైతులు చీడపీడల బెడదతో ఇబ్బంది పడుతున్నారు. నాటినప్పటి నుంచి పంట చేతికి వచ్చే వరకు మందులను స్ప్రే చేయాల్సి వస్తుంది. ముందుగా వేసిన వరిలో తక్కువగా ఉండి ఆలస్యంగా వేసిన వరిలో తెల్ల గొలక ఎక్కువగా ఉంది. దీని వల్ల దిగుబడి ఎకరాకు సుమారు ఐదు సంచుల ధాన్యం తగ్గే అవకాశం ఉంది.

నిరుపయోగంగా డంపింగ్ యార్డులు



నిరుపయోగంగా మారిన డంపింగ్ యార్డు



ఊరికి దూరంగా నిర్మించిన డంపింగ్ యార్డు

● కనపడని సేంద్రియ ఎరువుల తయారీ
● నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు

మద్నూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పల్లె ప్రగతిలో భాగంగా గ్రామాల్లో లక్షల్లో నిధులు వెచ్చించి నిర్మించిన చెత్త డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారడంతో ప్రభుత్వ లక్ష్యం నీరు గారుతుంది. దీని ముఖ్య ఉద్దేశం గ్రామాల్లో ప్రతీ ఇంటి నుంచి పారిశుద్ధ్య సిబ్బంది తడి, పొడి, చెత్తను వేర్వేరుగా సేకరించాల్సి ఉంటుంది. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలిస్తారు. కుళ్లిపోయే స్వభావం గల చెత్తను ఒక అరలో, కాలిపోయే స్వభావం గల చెత్తను మరో అరలో వేసి పొడి చెత్తలోని ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేస్తారు. ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ నిమిత్తం తరలించి తడి చెత్తతో కంపోస్టు (సేంద్రీయ) ఎరువులు తయారు చేసి రైతులకు సరఫరా చేసే కార్యాచరణపై ప్రత్యేక బృందంతో ప్రజలకు అవగాహన కల్పించారు. కానీ ఇప్పుడు గ్రామాల్లో ఆ దిశగా సేంద్రీయ ఎరువుల తయారీ కనిపించడం లేదు.

● **ఉమ్మడి మండలంలో ఇలా...**

ఉమ్మడి మండలంలోని ఆయా గ్రామాల్లో ఊరికి దూరంగా నిర్మించిన డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారుతున్నాయి. గ్రామాల్లో తడి, పొడి, చెత్త సేకరణలో నిర్లక్ష్యం చేస్తున్నారు. కొన్నిచోట్ల తూతూ మంత్రముగా చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. దీంతో గ్రామాల్లోని శివారు ప్రదేశాల్లో చెత్తను డంపింగ్ చేయడంతో కుప్పలుగా పేరుకుపోతున్నాయి. సేంద్రీయ ఎరువును వినియోగించి నాన్ పెస్టిసైడ్స్ అగ్రికల్చర్ రసాయన ఎరువుల అవసరం లేని వ్యవసాయం తీర్చి వ్యవ సాయంగా తీర్చిదిద్దాలని లక్ష్యం మరుగున పడింది. మూడేళ్ల క్రితం ప్రతి గ్రామంలో తడి, పొడి, చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రతీ ఇంటికి వేర్వేరుగా చెత్త సేకరణకు ప్లాస్టిక్ డబ్బాలు అందించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు సైతం చెత్త సేకరణ సేంద్రీయ ఎరువుల తయారీ తదితర అంశాలపై సుదీర్ఘంగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్యంగా చెత్తను వేరువేరుగా సేకరించే పరిస్థితి లేకపోవడం ప్రజలు వేరువేరుగా చెత్తను వేయడంలో ఆసక్తి కన పరచకపోవడంతో లక్ష్యం నీరుగారి పోతుంది.

● **రూ. లక్షల నిధులు వృథా**

ఒక్కో డంపింగ్ యార్డు నిర్మాణం కోసం ఈజీఎస్ నిధుల నుంచి రెండు లక్షలు కేటాయించారు. ప్రారంభ దశలో వాటి నిర్వహణపై ఆసక్తి కనబరిచిన అధికార యంత్రాంగం కాలక్రమేనా వాటిని పట్టించుకోక పోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. అధికారుల పట్టింపు లేని కారణంగా లక్షల రూపాయలు వృథా అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు గ్రామస్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి తడి, పొడి, చెత్త వేరు చేయడంలో వారిని చైతన్యవంతం చేసే బాధ్యత వారిపై ఉంది. దీంతో పాటు డంపింగ్ యార్డుల నిర్వహణ పూర్తిస్థాయిలో చేపట్టి ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించడంతో పాటు గ్రామపంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చేలా చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్

'బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి'

కామారెడ్డిటౌన్, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పిలుపునిచ్చారు. సోమవారం తన నివాసంలో నియోజకవర్గ ముఖ్యనాయకుల సమావేశంలో సన్నాహక సభ ఏర్పాట్లపై ఆయన మాట్లాడారు. నియోజకవర్గం నుంచి 3వేల మంది కార్యకర్తలు తరలించాలని నిర్ణయించామని తెలిపారు. పార్టీ నిర్ణయించిన సంఖ్యకు తక్కువ కాకుండా చూడాలని సూచించారు. పార్టీ రజతోత్సవ సభను పురస్కరించుకుని 27న గ్రామంలో పార్టీ జెండాఆవిష్కరించి సభకు బయలుదేరాలన్నారు. పండుగ వాతావరణంలో పార్టీ సభను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తామన్నారు. 1500 ఎకరాల్లో చారిత్రాత్మకంగా నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయడానికి నియోజకవర్గంలోని ప్రధాన చౌరస్తాలో వాల్ పేయింటింగ్, పార్టీ నినాదాలను రాయిస్తామన్నారు. ప్రజలను చైతన్యవంతులను చేయడానికి సభకు తరలిరావడానికి ఇంటింటి ప్రచారం నిర్వహించాలని సూచించారు. సమావేశంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్,మాజీ జడ్పీటీసీ మినుకురి రాంరెడ్డి, గంగ్రమధుసూదన్, మాజీ ఎంపీపీలు బాలమణి, పిప్పిరి ఆంజనేయులు, పార్టీ అధికార ప్రతినిధులు బలవంతరావు, గైని శ్రీనివాస్ గౌడ్, పార్టీ నాయకులు జూకంటి మోహన్‌రెడ్డి, ప్రభాకర్‌యాదవ్, ప్రభాకర్ రెడ్డి, భానుతో తదితరులు పాల్గొన్నారు.

అంజనిలో సీసీ రోడ్డు పనుల ప్రారంభం

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ చట్టం నిధులతో మండ లంలోని అంజని గ్రామంలో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారం భించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధి నిధులు రూ.15లక్షలతో లచ్చిరాంతండా, అంజనీ గ్రామం లో రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు చిప్ప మోహన్, సంజీవ్, సాయగౌడ్, నాందేవ్ పటేల్, పండరి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో ఎడ్లబండ్ల ప్రదర్శన

ఎల్లారెడ్డి, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణకేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న లక్ష్మమ్మ ఆలయంవద్ద సోమవారం శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించి సాయంత్రం ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. చిన్నారులు సైతం చిన్నబండ్లను ఆలయం చుట్టూ ప్రదర్శించారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత

దోమకొండ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని అంచనూర్, సీతారాంపల్లి గ్రామాల్లో మండలాధ్యక్షుడు అనంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ కార్యదర్శులు తాటిపల్లి శ్రీకాంత్, అబ్రబోయిన స్వామి మాట్లాడారు. రాజ్యాంగాన్ని కాపాడుకుంటేనే దేశ ప్రజల జీవన స్థితిగతుల ప్రగతివైపు పయనిస్తాయన్నారు. కార్యక్రమంలో నాయకులు పల్లె రామస్వామిగౌడ్, రాజం, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, షమ్మీ, స్వామిగౌడ్, నాంపల్లి, లక్ష్మణ్, నరేష్, బాబు, ఈశ్వర్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

అచ్చంపేటలో రసవత్తరంగా కుస్తీ పోటీలు

నిజాంసాగర్, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): శ్రీ రామనవమిని పురస్కరించుకొని అచ్చంపేట గ్రామంలో సోమవారం కుస్తీ పోటీలను నిర్వహించారు. ఈ కుస్తీ పోటీల్లో కర్ణాటక, మహారాష్ట్ర, ఎల్లారెడ్డి, బాన్సువాడ, పిట్లం, కలేర్, నారాయణఖేడ్ తదితర మండలాల నుంచి మల్లయోధులు వచ్చి కుస్తీ పోటీల్లో కుస్తీలలో తలపడ్డారు. కొబ్బరికాయ పోటీ నుంచి మొదలుకొని ఐదువేల రూపాయల నగదు బహుమతులను కుస్తీ పోటీలో నెగ్గిన మల్ల యోధులకు గ్రామ ప్రముఖులు అందజేశారు. ఈ పోటీలను ఉదయం, సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, ప్రజాప్రతి నిధులు తదితరులు ఉన్నారు.

ఉరివేసుకుని ఒకరి ఆత్మహత్య

కామారెడ్డిటౌన్, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణపోలీసుస్టేషన్ పరిధిలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన బోదాసు రాజు (35) సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ సీఐచంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గత 13 ఏళ్ల క్రితం లక్ష్మీ అనే మహిళతో రాజుకు వివాహం కాగా ఇద్దరు సంతానం కలిగారు. భార్యభర్తల మధ్య గొడవ కారణంగా లక్ష్మీ అతనిని వదిలి పుట్టింటికి వెళ్లింది. మద్యానికి బానిసై రాజు ఆదివారం రాత్రి ఇంట్లోఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి కుటుంబసభ్యులు తెతలపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

అటవీ ప్రాంతంలో మహిళ హత్య

గాంధారి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడిపల్లి అటవీ ప్రాంతంలో అమీనా బేగం అనే మహిళ హత్య జరిగినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి గ్రామం చందానగర్ తండాకు చెందిన కేతావత్ ఫీరాజీ గత కొన్నేళ్లుగా హైదరాబాద్‌లోనే ఉంటూ బేగంపేటలో భిక్షటన చేస్తుండేవాడు. ఫీరాజీ ఉంటే ప్రాంతంలోనే అమీనా బేగం కూడా భిక్షటన చేసేది. నాలుగేళ్ల పీరాజి కొడుకు శ్రీకాంత్ కనిపించకుండాపోవడంతో ఫీరాజి కొడుకును అమినాభేగం ఎత్తుకుపోయిందనే అనుమానంతో హైదరాబాద్ నుంచి ఆమెను మేడిపల్లి గ్రామశివారులో ఉన్న అటవీ ప్రాంతంలోకి తీసుకువచ్చాడు. తన కొడుకు జాడ చెప్పాలని అమినా బేగంను కర్రతో విపరీతంగా కొట్టగా ఆమె కుడిచేయి విరిగిపోయి రక్తస్రావమైంది. దీంతో 108లో గాంధారి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా ఆమె చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మేడిపల్లి మాజీసర్పంచ్ నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజనేయులు తెలిపారు.

నీటిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

నిజాంసాగర్, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): ఈనెల 4న మంజీరా నదిలో స్నానానికి వెళ్లిన నిజాంసాగర్ మండలం బంజపల్లి గ్రామానికి చెందిన గడ్డం భాగాయ్య మృతదేహాన్ని పోలీసులు సోమవారం గుర్తించారు. మృతదేహాన్ని వెలికితీసి గడ్డం సాయిలు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. గడ్డం బాలయ్యకు ఎవరూ వారసులు లేకపోవడంతో మృతదేహాన్ని మాజీ సర్పంచ్ బేగరిరాజుకు అప్పగించినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. గడ్డం భాగయ్య అంత్యక్రియల కోసం డీఎస్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి రూ.ఐదు వేల ఆర్థిక సహాయాన్ని మాజీ సర్పంచ్ బేగారి రాజుకు అందజేశారు. వారసులు ఎవరూ లేకపోవడంతో బంజపల్లి గ్రామానికి చెందిన కులస్తులే ఖననం చేశారు.

కృత్రిమ ఉపగ్రహాలపై విద్యార్థులకు అవగాహన

భిక్కనూరు, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలకేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఎక్స్‌పర్ట్ టాక్ కార్యక్రమంలో భాగంగా సోమవారం అంతరిక్షం, కృత్రిమ ఉపగ్రహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఇస్రోజూనియర్ ఇంజనీర్ డాక్టర్ రఘువర్మ విద్యార్థులకు అంతరిక్షం, కృత్రిమ ఉపగ్రహాలు, వాటి పనితీరు, వాటి వలన కలిగే లాభాలు, వివిధ రంగాలపై వాటి ప్రభావం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు బాగాచదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.

దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టొద్దు: కలెక్టర్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టొద్దని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 73 ఫిర్యాదులు రాగా ఇందులో భూముల సమస్యలు, రెండు పడక గదుల ఇళ్ల మంజూరు, రైతు భరోసా, పింఛన్ల మంజూరు తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయని తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సాధ్యసాధ్యాలపై సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై చర్యలు చేపట్టి దరఖాస్తుదారునికి సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్‌నాయక్, ఆర్‌డీఓ వీణ, అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

ఫాసిజానికి వ్యతిరేకంగా జాతీయ నిరసన దినం పాటిద్దాం

ఫాసిజంతో దేశంలో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని తమ ఫాసిజానికి వ్యతిరేకంగా జాతీయ నిరసన దినం పాటిద్దామని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ అన్నారు. సోమవారం కలెక్టరేట్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. నిత్యవసర సరుకుల ధరలు ఆకాశన్నంటాయని, నిరుద్యోగం విలయ తాండవం చేస్తోందని అన్నారు. సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ మంగళవారం దేశవ్యాప్తంగా నిరసనలు నిర్వహించనుందని చెప్పారు.

'అవుట్‌సోర్సింగ్ నోటిఫికేషన్‌ను రద్దు చేసేలా చర్యలు తీసుకోండి'

కామారెడ్డిటౌన్, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): అవుట్ సోర్సింగ్ నోటిఫికేషన్ రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ సలహారుడు షబ్బీర్‌అలీ విద్యార్థి సంఘ నాయకులు కోరారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీలనాగరాజు, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్‌నాయక్ మాట్లాడుతూ మెడికల్ కళాశాల అవుట్ సోర్సింగ్ నియామకాలలలో పెద్దఎత్తున అవకతకవలు జరిగాయని అధికారులకు వినతి పత్రాలు అందించినా చర్యలు తీసుకోవడంలేదని తెలిపారు. అర్హతలు ఉండి జాబ్ రాని వాళ్లు ఇంకా పోరాడుతూనే ఉన్నారని, నోటిఫికేషన్ రద్దుచేసి కొత్త నోటిఫికేషన్ వేయాలని కోరారు. కొంతమంది మ్యాన్‌పవర్ ఏజెన్సీ మెరిట్‌లిస్టులో మొదటిస్థానంలో ఉండి కూడా జాబ్‌రాని బాధితులు ఏజెన్సీ వాళ్లను వివరణ కోరితే పొంతనలేని సమాధానం ఇస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బాధిత అభ్యర్థులు, తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాపూర్‌లో రోగుల రక్తసేకరణ

బిచ్కుంద, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దౌల్తాపూర్ గ్రామంలో పెద్దకొడప్‌గల్ పీహెచ్‌సీ సిబ్బంది రోగుల రక్తనమునా సేకరణ చేపట్టారు. 15 రోజులుగా ఆ గ్రామంలో జ్వరాలు కీళ్లనొప్పులు, కాళ్లు, చేతుల నొప్పులతో పదుల సంఖ్యలో మంచానపడ్డారని 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి వైద్యాధికారులు స్పందించి వైద్యపరీక్షలు నిర్వహించడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తంచేశారు. జ్వరం కీళ్లనొప్పులతో నీరసంగా ఉన్న కొందరిని బిచ్కుంద ప్రభుత్వఏరియా ఆసుపత్రికి తరలించి గ్లూకోజ్‌లు ఎక్కించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్ల పట్టివేత

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హస్గుల్ మంజీరా తీరం నుంచి మండలంలోని కాటేపల్లి గ్రామం మీదుగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. బిచ్కుంద మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ట్రాక్టరు యజమానులు మంజీరా నుంచి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని, అనుమతి లేకుండా ఇసుక తరలించడం నేరమని తెలిపారు.

ఘనంగా బోనాల పండుగ

ఎల్లారెడ్డి, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్మాజీపూర్ గ్రామంలో సోమవారం ముత్యాల పోచమ్మ, నల్ల పోచమ్మకు గ్రామస్థులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేసి సాయంత్రం అమ్మవారులకు మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతీ సంవత్సరం లాగా ఆనవాయితీలాగా బోనాలు నిర్వహిస్తున్నామని, పాడిపంటలు సంవృద్ధిగా పండాలని కోరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు. అలాగే మంగళవారం గ్రామంలో కుస్తీ పోటీలు ఉంటాయని చుట్టుపక్కల వివిధ మండలాల గ్రామాలకు చెందిన మల్ల యోధులు కుస్తీ పోటీలలో పాల్గొనేవారు పాల్గొనాలని గ్రామస్థులు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై కలెక్టర్ సమీక్ష

కామారెడ్డిటౌన్, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలపై సోమవారం కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం సేకరణకు 446 కేంద్రాలకు ఐకేపీ 15, పీఏసీఎస్ 153 కేంద్రాలను ఏర్పాటుచేసిందని, మిగిలిన 278 కేంద్రాలను వెంటనే ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ అధికారులు పూర్తిసమన్వయంతో పనిచేస్తు కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలని ఆయన కోరారు. అకాలవర్షాలను దృష్టిలో ఉంచుకుని కేంద్రాలలో తగినన్ని టార్పలిన్‌లను ఏర్పాటుచేయాలని మార్కెటింగ్‌శాఖ వారికి సూచించారు. ఇప్పటివరకు 271 రైతుల నుండి 2958 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని అలాగే రూ.45లక్షల నగదును 31 రైతుల బ్యాంకు ఖాతాలలో జమచేశామని తెలిపారు. ప్రతి రైతుకు 24 గంటల్లో డబ్బులు తమ బ్యాంక్ ఖాతాల్లో పడేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలను పరిష్కరించడానికి జిల్లా కార్యాలయంలో టోల్‌ఫ్రీ నంబర్ 08468-220051 ఏర్పాటుచేశామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా పౌరసరాపరాలసంస్థ జీఎం రాజేందర్, డీసీఎస్ఓ మల్లిఖార్జున్‌బాబు, డీఏఓ తిరుమలప్రసాద్, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య, డీటీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

బీర్కూర్, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను పొందాలని ఏఎంసీ చైర్మెన్ శ్యామల అన్నారు. సోమవారం ఐకేపీ గ్రామ సంఘాల ఆధ్వర్యంలో తిమ్మాపూర్, నాగాపూర్‌లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఏఎంసీ చైర్మెన్ శ్యామల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు, రైతులు, వీవోఏలు, ఐకేపీ సిబ్బంది సీసీఎస్‌లు పాల్గొన్నారు.

రైతుల కోసమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): రైతుల ప్రయోజనం కోసమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని సహకార సంఘం అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పెద్దకొడప్‌గల్, కాస్లాబాద్ గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ధాన్యాన్ని దళారులకు అమ్మకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకు తెచ్చి అమ్ముకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో వరి ఏ గ్రేడ్ రకం క్వింటాకు రూ.2320, బీ గ్రేడ్ రకం రూ.2300 చొప్పున ధర నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘ డైరెక్టర్లు నాగిరెడ్డి, అనంతరరావ్, మానిటరింగ్ ఆఫీసర్ లక్ష్మినారాయణ, సిఈవో సందీప్, ఏఈవోలు రూప, రాజ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

లింగంపేట, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపేట, లింగంపల్లి, కోమట్‌పల్లి, పోతాయిపల్లి, సూరాయిపల్లి, శెట్పల్లి, జల్దిపల్లి, భవానిపేటలలో సోమవారం యాసంగి ధాన్యంకొనుగోలు కేంద్రాలను పీఏసీసీ చైర్మన్ దేవెందర్‌రెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు క్వింటాలుకు ఏ గ్రేడుకు రూ.2320 చెల్లిస్తుందని తెలిపారు. దళారుకుల విక్రయించి రైతులు నష్టపోవద్దని ఆయన కోరారు. కార్యక్రమంలోపాలక వర్గ సభ్యులు సాయాగౌడ్, మానిటరింగ్‌అధికారిని రాధిక, సీసీవో పెంటయ్య, ఏవో అనిల్‌కుమార్ ఉన్నారు.

సేంద్రియ ఎరువు తయారీపై దృష్టి సారించాలి: డీపీవో

భిక్కనూరు, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): ప్రతీ గ్రామంలోని కంపోస్టు షెడ్డులో సేంద్రియ ఎరువు తయారీపై సిబబంది దృష్టిసారించాలని డీపీవో మురళి అన్నారు. సోమవారం మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీచేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించి గ్రామంలోని నర్సరీ, కంపోస్టు షెడ్డును పరిశీలించారు. కంపోస్టు షెడ్డును శుభ్రంగా ఉంచాలని, ప్రతీరోజు చెత్త ట్రాక్టర్‌లో తడిచెత్త, పొడిచెత్త వేరుచేసి వేసేలా అవగాహన కల్పించాలన్నారు. వేసవికాలం దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామపంచాయితీ ఈవో లక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

మద్నూర్,ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తోందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. సోమవారం డోంగ్లి మండల పర్యటనలో భాగంగా సింగిల్‌విండో కార్యాలయంలో వారి ధాన్యం, పొద్దు తిరుగుడు గింజల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయంలో 24మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు రుణమాఫీ రైతు భరోసాతోపాటు రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తూ సన్నరకం వారికి బోనస్ అందజేశామని గుర్తుచేశారు. రైతులు పండించిన పంటను కొనుగోలు చేయడానికి కల్పించడానికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నిరుపేద ఆడ పిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక సహాయంగా కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ అందజేస్తున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలందరికీ ఉచితబస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అనంతరం మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించిన జైబాపూ, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని గుర్తుచేశారు. దేశాన్ని పరిపాలిస్తున్న ప్రస్తుత ప్రభుత్వం రాజ్యాంగాన్ని అవమాన పరుస్తూ రాజ్యాంగస్ఫూర్తిని దెబ్బతీస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపిఓ వెంకట నరసయ్య, సింగిల్ విండో ఛైర్మన్ రామ్ పటేల్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు పరమేశ్ పటేల్, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు శివాజీ పటేల్, నాయకులు పాల్గొన్నారు.



వరి, పొద్దు తిరుగుడు గింజల కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కల్లునాయక్‌లు!

(5వ పేజీ తరువాయి)

ఉపయోగిస్తూ కల్తీకల్లును తయారు చేస్తున్నారు. ప్రధానంగా పలు కల్లు డిపోలతోనే నిషేధిత మత్తుపదార్థాలను కలుపుతూ కల్తీ కల్లు తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో కల్తీకల్లు తయారీలో వ్యాపారులు డైజోఫామ్, క్లోరోహైడ్రేడ్ లాంటి మత్తుపదార్థాలను ఉపయోగించేవారు. వీటి లభ్యత తగ్గడం ధర ఎక్కువగా ఉండడంతో ఇటీవల కాలంలో అల్ఫ్రాజోలం అనే మత్తు మందును ఎక్కువగా వ్యాపారులు ఉపయోగించి కల్లును తయారు చేస్తున్నారు. చెట్ల నుంచి తీసిన కొద్దిపాటి కల్లులో నీల్లు పోసి మత్తు మందు కలిపిన అనంతరం తీపిగా ఉండేందుకు చాక్రిన్‌పౌడర్, పులుపు కోసం ఈస్ట్ పౌడర్, నురుగు కోసం కుంకుడు రసం పోస్తున్నారు. మరిన్ని హానికరమైన పదార్థా లను ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది. దాదాపు జిల్లాలోని అన్ని కల్లు దుకాణాల్లోనూ కల్తీకల్లే లభిస్తోంది. గతంలో పలు కల్లు దుకాణాలలో ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేసి టెస్టింగ్ కిట్ల ద్వారా పరిక్షించగా క్లోరైడ్‌హైడ్రైడ్ ఉన్నట్లుగా గుర్తించారు. అంతేకాకుండా గతంలో కామారెడ్డి, పిట్లం, భిక్కనూరు, దోమకొండ, బీర్కూరు, నస్రూళ్లబాద్ మండలాల్లో పలు కల్లు దుకాణాల్లో కల్తీకల్లు తయారుకు ఉపయోగించే అల్ఫ్ర జోలం, డైజోఫామ్ లాంటి మత్తుపదార్థాలను ఎక్సైజ్ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ప్రమాదకర మత్తు పదార్థాలను కల్లులో వినియోగిస్తూ వ్యాపారులు జోరుగా కల్తీకల్లు తయారు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

● దాడులు చేస్తున్నా.. ఆగని కల్తీ దందా

జిల్లాలో కల్తీ కల్లుతోపాటు నిషేధిత మత్తుపదార్థాలు, గంజాయి లాంటివాటిపై ఎక్సైజ్, పోలీసుశాఖలు నిఘా పెడు తున్న కల్తీ మత్తుపదార్థాల దందా మాత్రం ఆగడం లేదు. ప్రతీరోజు ఏదో ఒకచోట గంజాయో లేదా నిషేధిత మత్తు పదార్థామైన అల్ఫ్రాజోలం లాంటివి పోలీసులు, ఎక్సైజ్ తనిఖీలలో బయట పడుతూనే ఇటీవల మద్నూర్ మండలంలో పెద్దమొత్తంలోనే కొందరు వ్యక్తులనుంచి అల్ఫ్రాజోలాన్ని పోలీసులు దాడిచేసి స్వాధీనం చేసుకున్నారు. వడ్డీ, ఫైనాన్స్ వ్యాపారంచేసే ఇళ్లలో పోలీసులు సోదాలు చేస్తుండగా మద్నూర్‌లోని కొందరివ్యాపారుల ఇళ్లలో అల్ఫ్రాజోలంను పోలీసులు గుర్తించారు. తీరా క్షేత్రస్థాయిలో విచారణ జరపగా అల్ఫ్రాజోలం స్మగ్లింగ్ చేస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇలా పోలీసుల తనిఖీలలోనే కాకుండా ఎక్సైజ్ శాఖ తనిఖీలలోను నిషేధిత మత్తుపదార్థాలు పెద్దమొత్తంలోనే బయట పడుతున్నాయి. కానీ ఈ మత్తుపదార్థాల దందా మాత్రం ఆగకపోవడంపై పలు విమర్శలకు తావిస్తోంది. ఆయా శాఖల్లో అధికారులు ఏదో నిఘా పెట్టి తనిఖీలు చేసి కేసులు పెడుతున్నారే తప్ప మూలాలను వెలికి తీయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ మత్తుపదార్థాలకు సామాన్యులు బానిసలవుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

గుట్టలు మాయం!

(5వ పేజీ తరువాయి)

మట్టి, మొరం విక్రయాలతో వ్యాపారం సాగిస్తున్నారు. మట్టి, మొరం అక్రమ తవ్వకాలను నియంత్రించాలని స్థానికులు పేర్కొంటున్నారు.

● మొరం మాఫియాతో అధికారుల కుమ్మక్కు

రాత్రి వేళలో జరుగుతున్న అక్రమ మొరం తవ్వకాలు, రవాణాతో రెవెన్యూ, పోలీస్‌శాఖలో కొంతమంది అధికారులు కుమ్మక్కు అయినట్లు పలు ఆరోపణలు ఉన్నాయి. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకూ పోలీస్ శాఖ ఎదుట నుంచే అక్రమ మొరం రవాణా సాగుతున్నా.. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు సైతం పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు ఉన్నాయి. ఇంత అక్రమరవాణా జరుగుతున్నా.. నియంత్రించడంలో అటు రెవెన్యూ, ఇటు పోలీస్‌శాఖ పూర్తిగా విఫలమైందని పలువురు పేర్కొంటున్నారు. అంతేకాకుండా కొంతమంది అధికారుల ప్రమేయం ఉండడంతోనే రాత్రి వేళలో అక్రమ రవాణా సాగుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేకబృందంతో తనిఖీలు చేపట్టి అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కల్తీ కల్లు తాగి 32 మందికి అస్వస్థత

(5వ పేజీ తరువాయి)

గల కారణాలను ఆమె అడిగి తెలుసుకున్నారు.

● విచారణ చేపట్టిన ఎక్సైజ్ శాఖ

నసురుల్లాబాద్ మండలంలోని అంకోల్ గ్రామంలో నిర్వహిస్తున్న కల్లు దుకాణాన్ని ఎక్సైజ్ శాఖ సీఐ యాదిరెడ్డి పరిశీలించారు. అందులో నుంచి కల్లు శాంపిళ్లను తీసుకొని వెళ్లారు. అందులో ఏవైనా మత్తు పదార్థాలు ఉన్నాయా!? లేదా!? అన్న విషయాన్ని తెలుసుకోవడం కోసం ల్యాబ్‌కు పంపిస్తామని ఎక్సైజ్ సీఐ యాదిరెడ్డి తెలిపారు. ఆ తర్వాత కల్తీకల్లును పూర్తిగా ధ్వంసం చేసి పారవేశారు.

కాంగ్రెస్ నాయకుల మహా పాదయాత్ర

రామారెడ్డి, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి లక్ష్మణ్‌గౌడ్, మండల వర్కింగ్ అధ్యక్షుడు సామల శీలాసాగర్ నినాదాలు చేస్తూ పాదయాత్రగా సాగారు. రథాలగైన్ చౌరస్తా నుంచి గాంధీ విగ్రహం, అంబేద్కర్ విగ్రహాల వరకు పాదయాత్ర నిర్వహించిన అనంతరం విగ్రహాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో రామ్ రెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లపల్లి లక్ష్మా గౌడ్, మండల వర్కింగ్ అధ్యక్షుడు సామల శీలాసాగర్, నాయకులు రంజిత్, శేఖర్, మండల కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షుడు ఇర్ఫాన్, నాయకులు తదితరులున్నారు.

బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు

రామారెడ్డి, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): మండలం మద్దికుంటలో గల శ్రీ స్వయంభూ బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంతులు జంగం ప్రభుస్వామి ఆధ్వర్యంలో ఆలయ గర్భగుడిలో అభిషేకాలు, సింధూర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఉచితంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక, సింధూర పూజలు, అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పంతుళ్లు గణేష్, బాలు, ఆలయాల కమిటీల చైర్మెన్ లచ్చిరెడ్డి, మైపాల్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు, మాజీ సర్పంచులు రాంరెడ్డి, గీరెడ్డి మహేందర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి రాజేందర్, రాజకీయ నాయకులు తోట రాజు, లింగం, లింబాద్రి, శ్రీనివాస్, గణేష్, ప్రసాద్, యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పలు తండాల్లో కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుల నియామకం

లింగంపేట, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు తండాల్లో సోమవారం ఎస్టీ సెల్ కార్యవర్గాలను నియమించినట్లు మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు పీర్‌సింగ్ తెలిపారు. మండలంలోని రాంపూర్‌తండా అధ్యక్షులుగా పరుశురాం, కార్యదర్శిగా దేవిసింగ్, ఎక్కపల్లితండాలో అధ్యక్షులుగా శివరాం, కార్యదర్శిగా శ్రీనివాస్, ముంబాజీపేటతండాలో అధ్యక్షుడుగా మహేందర్, కార్యదర్శిగా కృష్ణ, కొయ్యగుండుతండాలో అధ్యక్షులుగా నంద్య, కార్యదర్శిగా సంగ్య, జగదంబతండాలో అధ్యక్షుడుగా రవీందర్, కార్యదర్శిగా శ్రీనివాస్‌లను ఎన్నుకున్నట్లు తెలియజేశారు.

రాజ్యాంగంపై ప్రజలకు అవగాహన

మద్నూర్, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని కాంగ్రెస్ పార్టీ మద్నూర్ మండల అధ్యక్షుడు సాయిలు అన్నారు. మండలంలోని పెద్ద ఎకలారా, దన్నూర్ గ్రామాలలో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర చేపట్టారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి సముచిత న్యాయం కల్పించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తుచేశారు. అంతకుముందు గ్రామాలలో పాదయాత్ర చేశారు. అనంతరం గ్రామంలోని దన్నూర్ చౌక ధరల దుకాణం వద్దకు వెళ్లి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్మన్ శ్రీనివాస్ పటేల్, మాజీ సర్పంచ్ హనుమంత్ రావు దేశాయ్, విట్టల్ గురూజీ, బండి గోపి, అమూల్ షిండే, తదితరులు పాల్గొన్నారు.

'పెన్షనర్‌లకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి'

కామారెడ్డి టౌన్, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు, కార్మికులకు, పెన్షనర్‌లకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయా ఉపాధ్యాయ,ఉద్యోగ సంఘాల నాయకులు తెలిపారు. సోమవారం అన్ని సంఘాల ఆధ్వర్యంలో కామారెడ్డిలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగావారు మాట్లాడుతూ రాష్ట్రంలో రిటైర్డ్ అవుతున్న ఉద్యోగులకు ఎలాంటి డబ్బులు రావడంలేదని, సంవత్సరం దాటిన జీపీఎఫ్ డబ్బులు రావడం లేదని అన్నారు. మే 4న రాష్ట్రస్థాయి ఉద్యోగ సదస్సు, మే 15న జిల్లాకేంద్రంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు, జూన్ 9న రాష్ట్రస్థాయి మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, టీజీఓ అధ్యక్షుడు దేవేందర్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కుషాల్ ఉన్నారు.

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	170
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

